# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 10-7-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:267 పేజీలు:6 వెల: రూ.1/-


## 11 న ఆర్థికవేత్తలతో ప్రధాని మోడీ భేటీ

న్యూఢిల్లీ జూలై 9 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: రానున్న కేంద్ర వార్షిక బడ్జెట్ కోసం సలహాలు, అభిప్రాయాలు తీసుకునేందుకు ప్రధాని నరేంద్ర మోడీ వచ్చే గురువారం(జులై 11) ప్రముఖ ఆర్థికవేత్తలతో సమావేశం కానున్నారని ఒక సీనియర్ ప్రభుత్వ అధికారి మంగళవారం వెల్లడించారు. జులై 23న లోక్‌సభలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ప్రధానితో గురువారం జరిగే సమావేశంలో ఆర్థికవేత్తలు, వివిధ రంగాల నిపుణులతోపాటు నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బేరీ, ఇతర సభ్యులు కూడా పాల్గొననున్నారు.మోడీ 3.0 ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న తొలి ప్రధాన ఆర్థిక పత్రంగా బడ్జెట్‌ను పరిగణిస్తున్నారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు ఈ బడ్జెట్ రోడ్ మ్యాప్‌ను వేయగలదని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. గత నెల పార్లమెంట్ ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తూ సంస్కరణల వేగాన్ని పెంచేందుకు ప్రభుత్వ చారిత్రక చర్యలు చేపట్టగలదని సూచనప్రాయంగా వెల్లడించారు. ప్రభుత్వ విధానాలను, దార్శనికతను కేంద్ర బడ్జెట్ ప్రతిబింబిస్తుందని కూడా ఆమె తెలిపారు.రానున్న బడ్జెట్‌పై ఇప్పటికే నిర్మలా సీతారామన్ వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ఆర్థిక వేత్తలు, పారిశ్రామిక దిగ్గజాలతో చర్చలు జరిపారు.

### చురక

నిజాయితీ నిలకడ
నేడెక్కడ నేతలకు
సర్వం దిగజారుడే
సంపాదన మేతలకు.

పవరే ఇక పరమాత్మ
ప్రదక్షణే కదా నిత్యం
గెలిచిన పార్టీని వీడి
గోడ దూకుడే సత్యం



-వేల్పుల నారాయణ
9440433475

## దుర్గమ్మ సేవలో తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి,మంత్రి శ్రీధర్

**-అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అమాత్యులు**

**-ఘన స్వాగతం పలికిన దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు**



హైదరాబాద్, జులై 9 :ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే రెండో అతిపెద్ద దేవాలయమైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో కొలువైయున్న కనకదుర్గమ్మ వారిని తెలంగాణ రాష్ట్ర మంత్రులు దర్శించుకున్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడలో ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానానికి తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఐటీ శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు లు మంగళవారం విచ్చేయగా దేవాదాయశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి, కమిషనర్ ఎస్ సత్యనారాయణ ఆలయ కార్యనిర్వహణ అధికారి కేఎస్ రామారావు లు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు.

అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రులకు ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. మంత్రులు బట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు లకు కమిషనర్ అమ్మవారి శేష వస్త్రం, చిత్రపటం ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయాలు వైదిక కమిటీ సభ్యుడు శంకర సాండిల్య ఇతర ఆలయ అధికారులు ఉన్నారు.

### తెలుగు ప్రజలందరూ చల్లగా ఉండాలి...

దర్శనానంతరం భట్టి మీడియాతో మాట్లాడుతూ, ఎన్నో ఆశలు ఆకాంక్షలతో తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం ఇందిరమ్మ రాజ్యం ప్రజా ప్రభుత్వ పాలనలో సుభిక్షంగా, సురక్షితంగా ఉండాలని అమ్మవారిని మొక్కుకున్నానని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ప్రపంచంతో పోటీపడి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని సమగ్ర అభివృద్ధి చేయడానికి అమ్మవారు ఆశీర్వదించాలని ప్రార్థించనట్లు చెప్పారు. ప్రపంచంలో ఉన్న తెలుగు ప్రజలందరూ సుఖసంతోషాలతో చల్లగా ఉండే విధంగా అమ్మవారి దీవించాలని కోరానని వెల్లడించారు.. తెలంగాణ రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలతో రైతులు అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో విలసిల్లాలని కనుకదుర్గ అమ్మవారిని వేడుకున్నానని చెప్పారు.

## రాష్ట్రంలో డిఎస్సి యథాతథం.. షెడ్యూల్ ప్రకారమే పరీక్షలు

హైదరాబాద్ జూలై 9 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: రాష్ట్రంలో డిఎస్సి పరీక్షలు యథాతథంగా షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయని రాష్ట్ర విద్యాశాఖ స్పష్టం చేసింది. ఈ నెల 18 నుంచి ఆగస్టు 5 వరకు ఆన్‌లైన్‌లో డిఎస్సి పరీక్షలు జరగనుండగా, ఈ నెల 11వ తేదీ సాయంత్రం డిఎస్సి హాల్ టికెట్లు వెబ్‌సైట్ లో అందుబాటులో ఉంచుతామని, అభ్యర్థులు తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఇవి నరసింహారెడ్డి ప్రకటించారు.ఇటీవల టెట్ ఫలితాలు విడుదల కాగా, టెట్‌కు, డిఎస్సికి భిన్నమైన సిలబస్ ఉండటంతో చదవడానికి సమయం సరిపోవడం లేదని పలువురు ఆశావహులు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలోనే సోమవారం లక్డీకాపూల్‌లోని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడికి అభ్యర్థులు యత్నించారు. ఈ నేపథ్యంలోనే డిఎస్సి పరీక్షల నిర్వహణలో ఎలాంటి మార్పు లేదని పేర్కొంటూ స్పష్టం చేస్తూ పాఠశాల విద్యాశాఖ ప్రకటన విడుదల చేసింది.

### 18 నుంచి ఆగస్టు 5 వరకు పరీక్షలు

రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించనున్న డిఎస్సి -2024 పరీక్షలు ఈనెల 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించనున్నారు. తొలిసారి కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సిబిటి) విధానంలో డిఎస్సి పరీక్ష జరగనున్నది. రోజుకు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించనున్నట్లు డిఎస్సి పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇటీవల సబ్జెక్టుల వారీగా పరీక్షల తేదీలను ప్రకటించారు. డిఎస్సి 2024 ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ మార్చి 4న ప్రారంభంకాగా?గత నెల 20వ తేదీతో గడువు ముగిసిం ది. ఈ ఉద్యోగాలకు మొత్తం 2,79,966 మంది చేసుకున్నారు.

## పాలమూరుకు మహర్దశ ..రూ 396.09 కోట్లతో అభివృద్ధి పనులకు రేవంత్ శ్రీకారం

**-వివిధ అభివృద్ధి పనులు సీఎం రేవంత్.. శంకుస్థాపన**

**-సీఎం హోదాలో తొలిసారి పాలమూరు రాక**

**పాలమూరు యూనివర్సిటీలో పలు పనులు**

**-అకాడమిక్.. బ్లాక్.., గ్యాలరీ నిర్మాణం**

**-సంతోషం వ్యక్తం చేస్తున్న స్టూడెంట్స్**

మహబూబ్‌నగర్, జులై 9 :తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎం హోదాలో తొలిసారి మహబూబ్‌నగర్ జిల్లాలో మంగళవారం పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా రూ. 396.09 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పాలమూరు యూనివర్సిటీలో రూ. 42.40 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు, అలాగే రూ.13.44 కోట్లతో ఎస్టీపీ భవనానికి, అకాడామిక్ బ్లాక్, గ్యాలరీ పనులకు, ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.10కోట్లతో బాలికల హాస్టల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు..

### దేవరకద్రలో డిగ్రీ కాలేజీ భవనం..

దేవరకద్రలో రూ.6.1కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. మహబూబ్ నగర్ రూరల్ లో రూ.3.25 కోట్లతో చేపట్టనున్న కేజీవీబీ భవన నిర్మాణానికి, గండీడ్ లో రూ.6.2 కోట్లతో కేజీవీబీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మహబూబ్ నగర్ మున్సిపాలిటీలో రూ.37.87 కోట్లతో సీసీ రోడ్లు, స్టోరేజ్ ట్యాంక్ పనులకు, రూ.276.80 కోట్లతో ఎస్టీపీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దీంతో యూనివర్సిటీ విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

### పాలమూరులో వన మహోత్సం- మొక్కలు నాటిన రేవంత్

అంతకు ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వనమహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మహబూబ్ నగర్ కలెక్టరేట్ ఆలయంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అనంతరం, జిల్లా అభివృద్ధిపై కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. పాలమూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్యంపై సమీక్షించనున్నారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, చిన్నారెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉమ్మడి జిల్లాకు చెందిన ఐదుగురు కలెక్టర్లు, ఇతర అధికారులు సీఎం సమీక్షలో పాల్గొన్నారు.




## ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించిన మంత్రి సీతక్క

ములుగు, జులై 9 : గ్రామీణ మహిళలను పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, వారికి కావాల్సిన ప్రోత్సాహకాలు ప్రభుత్వం అందిస్తుందని పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కతెలిపారు. మంగళవారం ములుగు జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ఆవరణంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిం చారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ములుగు జిల్లాలో కలెక్టరేట్, ఏరియా హాస్పిటల్, ఐటీడీఏ, రామప్ప దేవాలయం ఆవరణలో మొత్తం నాలుగు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేస్తామన్నారు.



అందులో భాగంగా కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన జిల్లాలో మొదటి ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను ప్రారంభిం చామని పేర్కొన్నారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ లను ప్రారంభిస్తామని చెప్పారు.వివిధ రకాల ఆహార పదా ర్థాలతో క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నామ ని తెలిపారు. మహిళా శక్తి క్యాంటీన్ లలో ఆహారం అమ్మ చేతి వంటల ఉండాలని, నాణ్యతకు ప్రాధా న్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో ఎంపీ పోరిక బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, మహేందర్ జి,డీఆర్డీవో శ్రీనివాస్ కుమార్ పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి తో సిరాజ్ భేటి... శాలువ కప్పి క్రికెటర్ ను సత్కరించిన ముఖ్యమంత్రి



హైదరాబాద్, జులై 9 :తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టీమిండియా క్రికెటర్ మహమ్మద్ సిరాజ్ కలిశారు. టీ20 ప్రపంచ కప్ సాధించినందుకు గాను సిరాజ్‌ను ముఖ్యమంత్రి అభినందించారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛం ఇచ్చారు. ఈ సందర్భంగా టీమిండియా జెర్సీని రేవంత్ రెడ్డికి బహూకరించారు.

ఇక సిరాజ్‌కు హైదరాబాద్‌లో ఇంటిస్థలం, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని సీఎం నిర్ణయించారు. హైదరాబాద్ పరిసరాల్లో స్థలం గుర్తించాలని అధికారులను సీఎం ఆదేశించారు. కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత అజహరుద్దీన్ పాల్గొన్నారు.

## ఘనంగా బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ మహోత్సవాలు

**- తండోపతండాలుగా తరలివచ్చిన భక్తులు**

**-ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి కొండా సురేఖ**

హైదరాబాద్ జూలై 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. కల్యాణ మహోత్సవానికి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. అమ్మవారికి ప్రభుత్వం తరఫున మంత్రి కొండా సురేఖ పట్టువస్త్రాలు సమర్పించారు. అమ్మవారిని 27 చీరలు, స్వామివారికి 11 పంచెలతో అలంకారం చేశారు. బల్కంపేట ఎల్లమ్మను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ విజయలక్ష్మి, రాజకీయ నేతలు దర్శించుకున్నారు. పొన్నం ప్రభాకర్ దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. పొన్నానికి స్వాగతం పలికే సమయంలో స్వల్పంగా తోపులాట జరిగింది. దీంతో ప్రొటోకాల్ పాటించకపోవడంతో పొన్నం అలకబూనారు. కలెక్టర్ అనుదీప్‌కు పొన్నం ప్రభాకర్ ఫోన్ చేసి అసహనం వ్యక్తం చేశారు.

## సీతారామ ప్రాజెక్టు కాలువ పనులను వేగవంతం చేయాలి : మంత్రి తుమ్మల



హైదరాబాద్, జులై 9 : సీతారామ ప్రాజెక్టు కాలువల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాల్లో ఎక్కడా రాజీ పడవద్దని సూచిం చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలంలో మంగళవారం పర్యటించిన ఆయన.. గుంపెన గ్రామ శివారులో జాతీయ రహదారిపై నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టు కాలువ వంతెన, కాలువ నిర్మాణ పనుల ను భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణతో కలిసి పరిశీలించారు. ప్రాజెక్టు కాలువ నిర్మాణ పనుల పురోగతి గురించి అధికారులను అడిగి తెలుసుకొన్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్టు కాలువ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. పనులను వేగవంతంగా చేప ట్టేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాలువ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయా లని సూచించారు. ఈ కార్యక్రమంలో సీతారామ ప్రాజెక్టు సీఈ ఏ.శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఈ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ అర్జున్, డీఈఈ భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## రష్యాలో భారతీయ సముదాయాన్ని ఉద్దేశించి ప్రసంగించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జులై 9 :ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజున రష్యాలోని మాస్కోలో జరిగిన ఒక కార్యక్రమంలో భారతీయ సముదాయానికి చెందిన వారితో మాటామంతీ జరిపారు. ప్రవాసి భారతీయులు ప్రధాన మంత్రికి స్నేహభరితంగాను, ఉత్సాహపూర్వకంగాను స్వాగతం పలికారు.

సముదాయాన్ని ఉద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ, తనకు సాదరంగా స్వాగతం పలికిన భారతీయ ప్రవాసులకు ధన్యవాదాలను వ్యక్తం చేశారు. భారతదేశం-రష్యా సంబంధాలను పెంపొందింప చేయడంలో వారు అందిస్తున్న తోడ్పాటును ప్రధాన మంత్రి ప్రశంసించారు. 140 కోట్ల మంది భారతీయుల పక్షాన ప్రధాన మంత్రి భారతీయ సముదాయం సభ్యులకు శుభాకాంక్షలను తెలియజేస్తూ, వారితో సంభాషణ ప్రత్యేకమైందని ఆయన అన్నారు. దీనికి కారణం ఇది చరిత్రాత్మకమైన తన మూడో పదవీకాలంలో భారతీయ ప్రవాసులను ఉద్దేశించి తాను చేస్తున్న మొదటి ప్రసంగం కావడమే అని ఆయన అన్నారు.

గత పది సంవత్సరాలలో భారతదేశంలో చోటు చేసుకొన్న ప్రత్యక్ష మార్పు ను గురించి ప్రధాన మంత్రి మాట్లాడారు. ఇది భారతీయులు అందరికీ ఎంతో గర్వకారణమైన విషయం అని ఆయన అన్నారు. తన మూడో పదవీకాలంలో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారతదేశం మారాలి అన్నదే ప్రభుత్వ ధ్యేయమని ఆయన అన్నారు. భారతదేశం ఆర్థిక వృద్ధి, ప్రపంచ వృద్ధికి చెప్పుకోదగినంతగా దోహదం చేసింది అని ప్రధాన మంత్రి అన్నారు. భారతదేశం డిజిటల్ రంగంలో, ఫిన్ టెక్ రంగంలో సఫలం కావడాన్ని గురించి; హరిత రంగంలో పలు అభివృద్ధి సంబంధ కార్యసాధనలను భారతదేశం నమోదు చేయడాన్ని గురించి; భారతదేశం అమలు చేస్తున్న సామాజిక-ఆర్థిక కార్యక్రమాలు సామాన్య ప్రజానీకం సాధికారిత పై ప్రభావాన్ని కలుగజేయడాన్ని గురించి ప్రధాన మంత్రి మాట్లాడారు. 140 కోట్ల మంది భారతీయులు చాటిచెప్పిన అంకితభావం, నిబద్ధత, తోడ్పాటుల వల్ల భారతదేశం లో పరివర్తనాత్మకమైన సాఫల్యం సాధ్యపడింది, భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలి అని భారతీయులలో ప్రతి ఒక్కరు ప్రస్తుతం కలలు కంటున్నారని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. వాతావరణ మార్పును ఎదుర్కోవడం మొదలుకొని స్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడం వరకు చూసుకొన్నట్లయితే భారతదేశం తన నిబద్ధత పూర్వకమైన ప్రయత్నాల ద్వారా ప్రపంచ సౌభాగ్యానికి ముఖ్యమైన తోడ్పాటును అందిస్తూ, 'విశ్వబంధు' (ప్రపంచానికి మిత్రుడు) గా నిలుస్తోంది అని ఆయన అన్నారు. ప్రపంచ సమస్యలను పరిష్కరించడం కోసం శాంతి, సంభాషణ, దౌత్యం అనే మార్గాలను అనుసరించాలంటూ భారతదేశం ఇచ్చిన పిలుపునకు ప్రశంసలు దక్కాయని కూడా ఆయన అన్నారు.

రష్యా తో ఒక సుదృఢమైన, ప్రగాఢమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పుకోవడంలో ఒక క్రియాత్మకమైన పాత్రను పోషించడాన్ని కొనసాగించవలసిందని భారతీయ సముదాయానికి ప్రధాన మంత్రి సూచిస్తూ, వారిని ఉత్సాహపరిచారు. కజాన్ లో, ఎకాటెరిన్ బర్గ్ లో రెండు కొత్త భారతీయ వాణిజ్య దూత కార్యాలయాలను ప్రారంభించాలని నిర్ణయించడమైందని, వీటి ద్వారా రెండు దేశాల ప్రజల మధ్య సంబంధాలు మరింత పెంపొందుతాయని ఆయన అన్నారు. ఈ సంగతి ని ఆయన వెల్లడించడం తోనే సభికులు పెద్ద గా చప్పట్లు చరుస్తూ వారి సంతోషాన్ని వ్యక్తం చేశారు. దేశం లో భారతీయ సాంస్కృతిక సంప్రదాయాలను పెంచిపోషిస్తున్నందుకు, రష్యా ప్రజల తో చైతన్యభరితమైన సంబంధాలను నెరపుతున్నందుకు భారతీయ సముదాయాన్ని ప్రధాన మంత్రి ప్రశంసించారు

### నేటి కందం- నేటికీ అందం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

**యాతనలను దొలగించగ**
**నూతన ప్రక్రియలయందు నూలుకొనంగన్**
**చేతన మొసగెడి ఇంధన**
**స్వాతంత్ర్య దినోత్సవంబు జరుపగ వలయున్**



(జూలై 10 ప్రపంచ ఇంధన స్వాతంత్ర్య దినం..)

-రాధశ్రీ
సెల్:9494481210

## తెలంగాణ జిల్లాల్లో రెండు రోజులు భారీ వర్షాలు.. హెచ్చరించిన వాతావరణ కేంద్రం

హైదరాబాద్, జులై 9 : తెలంగాణలో రెండురోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. సోమవారం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరం మీదుగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం వాయువ్య బంగాళాఖాతాన్ని ఆనుకొని సగటు సముద్రమట్టానికి 3.1 నుంచి 7.6 కిలోమీటర్ల మధ్య ఎత్తులో ఉన్నట్లు తెలిపింది. మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. మిగతా ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది. బుధవారం నుంచి గురువారం ఉదయం వరకు పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు చాలాచోట్ల కురిసే అవకాశం ఉందని చెప్పింది. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, వరంగల్, హన్మకొండ, జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నారాయణపేట జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

## నీట్ యూజీ పేపర్ లీక్ కేసులో మరో ఇద్దరిని అరెస్ట్ చేసిన సీబీఐ

న్యూఢిల్లీ, జులై 9 : నీట్ యూజీ పేపర్ లీక్ కేసు లో కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ మరో ఇద్దరిని అదుపులో తీసుకుంది. అరెస్టయిన ఇద్దరు నిందితుల్లో ఒకరు నీట్ అభ్యర్థి కాగా, మరొకరు మరో నీట్ అభ్యర్థి తండ్రి అని సీబీఐ వర్గాలు వెల్లడించాయి. వారిద్దరూ బీహార్‌కు చెందినవారేనని తెలిపాయి. ఒకరిని నలంద జిల్లాలో, మరొకరిని గయా జిల్లాలో అదుపులోకి తీసుకున్నట్లు సీబీఐ అధికారులు చెప్పారు.

నీట్ పేపర్ లీకేజీ అంశం ప్రస్తుతం దేశవ్యాప్తంగా దుమారం రేపుతోంది. అభ్యర్థులతో ఒత్తిడితో ఈ అశంపై కేంద్రం సీబీఐ ఎంక్వయిరీ వేసింది. ప్రస్తుతం కేసు విచారణ జరుపుతోన్న సీబీఐ కేసుతో సంబంధం పలువురిని అరెస్ట్ చేసి విచారిస్తోంది. అదేవిధంగా పరీక్ష నిర్వహణలో అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నందున రద్దు చేసి మళ్లీ పరీక్ష నిర్వహించాలని 38 మంది అభ్యర్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు.

ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం.. నీట్ యూజీ పరీక్షలను మళ్లీ నిర్వహించే అంశంపై అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. దాంతో నీట్ యూజీ పరీక్షలను మళ్లీ నిర్వహిం చాల్సిన అవసరం లేదని, కేవలం పేపర్ లీక్ అయిన సెంటర్లలో మాత్రమే తిరిగి పరీక్షలు నిర్వహిస్తామని అఫిడవిట్‌లో పేర్కొంది. ఈ క్రమంలో నీట్ పేపర్ లీకైనట్లు స్పష్టమవుతోందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. పేపర్ ముందుగా ఏ పరీక్షా కేంద్రంలో లీకైంది.. ఎవరు లీక్ చేశారు.. అని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని ప్రశ్నించింది.

# ఆరోగ్యానికి తెల్ల రక్త కణాలు అవసరం - డాక్టర్ లిల్లీ మేరి

సిద్దిపేట, జులై 9 : తెల్ల రక్త కణాలు వ్యాధులతో పోరాడే సైనికులని మనకు తెలుసు. మన శరీరం రోజుకు 10 లక్షల తెల్ల రక్త కణాలను తయారు చేసుకుంటూ ఉంటుంది. ఇది శరీరంలోకి చొరబడే వేర్వేరు వ్యాధికారక క్రిములను పసిగట్టి, సంహరిస్తూ ఉంటాయి. అయితే మనము తరచూ చిన్నచితక అనారోగ్యాల బారిన పడుతున్నామంటే, తెల్ల రక్త కణాల సంఖ్య తగ్గుముఖం పట్టిందని అనుమానించి, వెంటనే వాటిని పెంచే చర్యలు చేపట్టాలి అని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లిల్లీ మేరి పేర్కొన్నారు.

ఏ పరిమాణములో?:

నార్మల్: ఒక మైక్రో లీటర్ రక్తంలో 4,500 నుంచి 10,500 తెల్ల రక్త కణాలు.

లోకౌంటు: ఒక మైక్రో లీటర్ రక్తంలో 4,500 కంటే తక్కువ తెల్ల రక్త కణాలు.

హైకౌంటు: ఒక మైక్రో లీటర్ రక్తంలో 11 వేలకు మించిన తెల్ల రక్త కణాలు.

తెల్ల రక్త కణాల్లో రకాలు:

న్యూట్రోఫిల్స్: ఇవి బ్యాక్టీరియా, వైరస్ సంబంధిత ఇన్ఫెక్షన్లతో పోరాడుతాయి.

ఇస్నోఫిల్స్: పేగులో పురుగులు మొదలైన పెద్ద పరాన జీవులతో పోరాడుతాయి. అలర్జీ కారకాలతో పోరాడే యాంటీ బాడీలను విడుదల చేస్తాయి.

బ్యాసి నోఫి ల్స్: అలర్జీ రియాక్షన్కు గురైనప్పుడు, హిస్టమిన్ విడుదల చేస్తాయి.

లింఫోసైట్స్: వీటిలో బీ,టీ న్యాచురల్ కిల్లర్ కణాలు ఉంటాయి. బి సెల్స్ వైరస్లను కనిపెట్టి వాటికి వ్యతిరేకంగా యాంటీ బాడీలు విడుదల చేస్తే, టి ,నాచురల్ సెల్స్ వైరస్లు క్యాన్సర్లు సోకిన కణాలతో పోరాడతాయి.

మోనోసైట్స్: ఇవి మాక్రో ఫేజులుగా మారి కణ శిధిలాలను సంగ్రహిస్తాయి,

కణాలు తగ్గడానికి కారణాలు:

ఎముక మజలో తయారయ్యే ఈ తెల్ల రక్త కణాలు తగ్గటానికి కొన్ని కారణాలు ఉన్నాయి. అవి ఏమిటంటే... వైరల్ ఇన్ఫెక్షన్లు, పుట్టుకతో వెంట వచ్చే జబ్బులు, క్యాన్సర్లు, ఆటో ఇమ్యునో డిజార్డర్లు, మద్యపానము, యాంటీబయాటిక్స్ వాడకము, పోషకాహార లోకము.

లక్షణాలు ఇవే:

తెల్ల రక్త కణాల తగ్గుదల కొన్ని లక్షణాల రూపంలో బయటపడుతుంది. విపరీతమైన జ్వరము, చలి, చమటలు పట్టడం ఇలాంటి లక్షణాలు కనిపిస్తాయి. ఒకవేళ ఏదైనా ఇన్ఫెక్షన్ మూలంగా తెల్ల రక్త కణాల సంఖ్య పడిపోతే, వాపులు, నోటి పుండ్లు, గొంతు నొప్పి, విపరీతమైన దగ్గు, శ్వాసలో ఇబ్బంది లాంటి లక్షణాలు మొదలవుతాయి అని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లిల్లీ మేరి అన్నారు.

తెల్ల రక్త కణాలను ఇలా పెంచు కోవచ్చు:

వెల్లుల్లి: వంటకాలలో వెల్లుల్లిని వాడుతూ ఉండాలి. పచ్చివి తినగలిగితే అలా తినవచ్చు.

పాలకూర: విటమిన్లు, ఖనిజ లవణాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఉండే పాలకూరను ప్రతిరోజు తింటూ ఉండాలి. వీలైతే రోజు రెండు టేబుల్ స్పూన్ల పాలకూరను ఆహారంతో కలిపి వండుకొని తీసుకోవాలి.

బొప్పాయి ఆకులు: ఈ ఆకుల్లో ఉండే ఎసిటో జెనీన్స్ తో తెల్ల రక్త కణాలు పెరిగి, రోగనిరోధక శక్తి సమకూరుతుంది. ఆకులను నీళ్లతో కలిపి మిక్సీలో వేసి ముద్దగా చేసుకోవాలి. తరవాత దీనిలో మరికొన్ని నీళు కలిపి వడగట్టి, ఒక టేబుల్ స్పూన్ రసం తీసుకోవాలి. ఇలా ప్రతిరోజూ తీసుకోవటం అలవాటు చేసుకోవాలి.

పెరుగు: పెరుగులోని ప్రోబయాటిక్స్ తెల్ల రక్త కణాలను వృద్ధి చేస్తాయి. కాబట్టి ప్రతిరోజు అరకప్పు పెరుగు తింటూ ఉండాలి.

కివి: ఈ పండులో తెల్ల రక్త కణాల పెరుగుదలకు తోడ్పడే యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ ఈ, సి, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. కాబట్టి రోజుకు రెండు పండ్లు తినాలి.

పొద్దు తిరుగుడు విత్తనాలు: వీటిలో ఫాస్పరస్, మెగ్నీషియం, విటమిన్ ఈ, బి6, యాంటీ ఆక్సిడెంట్లు, ఇతర పోషకాలు ఉంటాయి. కాబట్టి రోజుకు రెండు టీ స్పూన్ల సన్ ఫ్లవర్ సీడ్స్ తింటూ ఉండాలి అని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లిల్లీ మేరి తెలిపారు.

సిద్దిపేట: తెల్ల రక్త కణాలు వ్యాధులతో పోరాడే సైనికులని మనకు తెలుసు. మన శరీరం రోజుకు 10 లక్షల తెల్ల రక్త కణాలను తయారు చేసుకుంటూ ఉంటుంది. ఇది శరీరంలోకి చొరబడే వేర్వేరు వ్యాధికారక క్రిములను పసిగట్టి, సంహరిస్తూ ఉంటాయి. అయితే మనము తరచూ చిన్నచితక అనారోగ్యాల బారిన పడుతున్నామంటే, తెల్ల రక్త కణాల సంఖ్య తగ్గుముఖం పట్టిందని అనుమానించి, వెంటనే వాటిని పెంచే చర్యలు చేపట్టాలి అని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లిల్లీ మేరి పేర్కొన్నారు.

## ఏ పరిమాణములో..:

నార్మల్: ఒక మైక్రో లీటర్ రక్తంలో 4,500 నుంచి 10,500 తెల్ల రక్త కణాలు.

లోకౌంటు: ఒక మైక్రో లీటర్ రక్తంలో 4,500 కంటే తక్కువ తెల్ల రక్త కణాలు.

హైకౌంటు: ఒక మైక్రో లీటర్ రక్తంలో 11 వేలకు మించిన తెల్ల రక్త కణాలు.

తెల్ల రక్త కణాల్లో రకాలు:

న్యూట్రోఫిల్స్: ఇవి బ్యాక్టీరియా, వైరస్ సంబంధిత ఇన్ఫెక్షన్లతో పోరాడుతాయి.

ఇస్నోఫిల్స్: పేగులో పురుగులు మొదలైన పెద్ద పరాన జీవులతో పోరాడుతాయి. అలర్జీ కారకాలతో పోరాడే యాంటీ బాడీలను విడుదల చేస్తాయి.

బ్యాసినోఫిల్స్: అలర్జీ రియాక్షన్కు గురైనప్పుడు, హిస్టమిన్ విడుదల చేస్తాయి.

లింఫోసైట్స్: వీటిలో బీ,టీ న్యాచురల్ కిల్లర్ కణాలు ఉంటాయి. బి సెల్స్ వైరస్లను కనిపెట్టి వాటికి వ్యతిరేకంగా యాంటీ బాడీలు విడుదల చేస్తే, టి ,నాచురల్ సెల్స్ వైరస్లు క్యాన్సర్లు సోకిన కణాలతో పోరాడతాయి.

మోనోసైట్స్: ఇవి మాక్రో ఫేజులుగా మారి కణ శిధిలాలను సంగ్రహిస్తాయి,

కణాలు తగ్గడానికి కారణాలు:

ఎముక మజలో తయారయ్యే ఈ తెల్ల రక్త కణాలు తగ్గటానికి కొన్ని కారణాలు ఉన్నాయి. అవి ఏమిటంటే... వైరల్ ఇన్ఫెక్షన్లు, పుట్టుకతో వెంట వచ్చే జబ్బులు, క్యాన్సర్లు, ఆటో ఇమ్యునో డిజార్డర్లు, మద్యపానము, యాంటీబయాటిక్స్ వాడకము, పోషకాహార లోకము.

లక్షణాలు ఇవే:

తెల్ల రక్త కణాల తగ్గుదల కొన్ని లక్షణాల రూపంలో బయటపడుతుంది. విపరీతమైన జ్వరము, చలి, చమటలు పట్టడం ఇలాంటి లక్షణాలు కనిపిస్తాయి. ఒకవేళ ఏదైనా ఇన్ఫెక్షన్ మూలంగా తెల్ల రక్త కణాల సంఖ్య పడిపోతే, వాపులు, నోటి పుండ్లు, గొంతు నొప్పి, విపరీతమైన దగ్గు, శ్వాసలో ఇబ్బంది లాంటి లక్షణాలు మొదలవుతాయి అని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లిల్లీ మేరి అన్నారు.

తెల్ల రక్త కణాలను ఇలా పెంచు కోవచ్చు:

వెల్లుల్లి: వంటకాలలో వెల్లుల్లిని వాడుతూ ఉండాలి. పచ్చివి తినగలిగితే అలా తినవచ్చు.

పాలకూర: విటమిన్లు, ఖనిజ లవణాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఉండే పాలకూరను ప్రతిరోజు తింటూ ఉండాలి. వీలైతే రోజు రెండు టేబుల్ స్పూన్ల పాలకూరను ఆహారంతో కలిపి వండుకొని తీసుకోవాలి.

బొప్పాయి ఆకులు: ఈ ఆకుల్లో ఉండే ఎసిటో జెనీన్స్ తో తెల్ల రక్త కణాలు పెరిగి, రోగనిరోధక శక్తి సమకూరుతుంది. ఆకులను నీళ్లతో కలిపి మిక్సీలో వేసి ముద్దగా చేసుకోవాలి. తరవాత దీనిలో మరికొన్ని నీళ్లు కలిపి వడగట్టి, ఒక టేబుల్ స్పూన్ రసం తీసుకోవాలి. ఇలా ప్రతిరోజూ తీసుకోవటం అలవాటు చేసుకోవాలి.

పెరుగు: పెరుగులోని ప్రోబయాటిక్స్ తెల్ల రక్త కణాలను వృద్ధి చేస్తాయి. కాబట్టి ప్రతిరోజు అరకప్పు పెరుగు తింటూ ఉండాలి.

కివి: ఈ పండులో తెల్ల రక్త కణాల పెరుగుదలకు తోడ్పడే యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ ఈ, సి, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. కాబట్టి రోజుకు రెండు పండ్లు తినాలి.

పొద్దు తిరుగుడు విత్తనాలు: వీటిలో ఫాస్పరస్, మెగ్నీషియం, విటమిన్ ఈ, బి6, యాంటీ ఆక్సిడెంట్లు, ఇతర పోషకాలు ఉంటాయి. కాబట్టి రోజుకు రెండు టీ స్పూన్ల సన్ ఫ్లవర్ సీడ్స్ తింటూ ఉండాలి అని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లిల్లీ మేరి తెలిపారు.

# ఈనెల 16న ఏపీ కేబినెట్ .. 22 నుంచి అసెంబ్లీ సమావేశాలు ..

అమరావతి, జులై 9 :: ఈనెల 16న ఏపీ కేబినెట్సమావేశం జరగనుంది. సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సెక్రటేరియట్లోని ఫస్ట్ బ్లాక్లో రాష్ట్ర మంత్రివర్గం భేటీ కానుంది. ఇప్పటికే కేబినెట్ భేటీకి సంబంధించి మంత్రులకు సమాచారం కూడా వెళ్లింది. ప్రభుత్వం అమలు చేసే పథకాలు, ఎన్నికల హామీలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కూడా భేటీలో చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

కేబినెట్ సమావేశంలో చర్చించే అంశాలను ఈ నెల 11న సాయంత్రం 4 గంటల లోపు శాఖల వారీగా అందజేయాలని అధికారులను ఆదేశించింది. ఈనెల 22 నుంచి అసెంబ్లీ సమావేశాలు (ఒబబవఎఎత్రీఎ ఎవవబితినిణబ) కానున్నాయి. వీటిని ఐదు రోజుల పాటు నిర్వహించే అవకాశముంది. తొలిరోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం, తరువాత రోజుల్లో గవర్నర్ ప్రసంగంపై చర్చ, ధన్యవాద తీర్మానం ప్రవేశ పెట్టనున్నారు.

# జేఎన్ టీయూ కళాశాలలో చట్నీ పాత్రలో ఎలుక - అడిషనల్ కలెక్టర్ తనిఖీలు



జోగిపేట, జులై9: చౌటకూర్ మండల పరిధిలోని జేఎన్ టీ యూ ఇంజనీరింగ్ కళాశాలలోని హాస్టల్ లో సోమవారం రాత్రి విద్యార్థులకు వడ్డించే టిఫిన్ సమయంలో చట్నీ పాత్రలో చిట్టేలుక ప్రతిక్షమైంది. చట్నీ పాత్రలో ఉన్న ఎలుకను చూసి విద్యార్థులు ఆందోళన చెందారు. హాస్టల్ లో నాణ్యమైన భోజనం పెట్టడం లేదని ఈనెల 3న కళాశాలలో విద్యార్థులు ఆందోళన చేశారు. ఫుడ్ కాంట్రాక్టర్ ను వెంటనే మార్చాలంటూ ఆందోళన చేపట్టారు. ప్రిన్సిపాల్ హామీతో ఆందోళన విరవించుకున్న విద్యార్థులు తాజాగా మళ్లీ సోమవారం రాత్రి టిఫినీ సమయంలో చట్నీ పాత్రలో ఎలుక కనిపించడంతో విద్యార్థులు ఆందోళన చెందారు చట్నీ పాత్రలో చిట్టి ఎలుక అందులో తిరుగుతూ కనిపించడంతో అక్కడే ఉన్న విద్యార్థులు వారి సెల్ ఫోన్ లో వీడియోలు చిత్రికాయించి సోషల్ మీడియాలో పోస్ట్ చేసి వైరల్ చేశారు. దీంతో సోషల్ మీడియాలో చట్నీలో ఆ ఎలుక ప్రత్యక్షం వైరల్ గా మారింది. ఈ సంఘటన తెలుసుకున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ మాధురి, ఆర్డీవో పాండు తో కలిసి మంగళవారం జేఎన్టీయూ కళాశాలలోని హాస్టల్ ను సందర్శించి ఫుడ్ కు సంబంధించిన వస్తువులను ఆమె పరిశీలించారు. హాస్టల్లోని వన్డే పాత్రలు, పరిశుభ్రత లేకపోవడంతో కాంట్రాక్టర్ పై ఆగ్రహ వ్యక్తం చేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు వచ్చి తీరు మార్చుకోవాలని చెప్పిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేయడంతో వెంటనే చర్యలు తీసుకోవాలని, అవసరమైతే కాంట్రాక్టర్ ను మార్చుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ నర్సింహాను ఆదేశించారు. ఇదిలా ఉండగా ఈ సంఘటనపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పందించారు. పూర్తి నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతిని ఆదేశించారు. ఇలాంటివి మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.

# చంద్రబాబు నాయుడిని కలిసి అభినందనలు తెలిపిన తాడేల సరస్వతి

హైదరాబాద్ జులై 9 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు నాల్గవసారి ముఖ్యమంత్రి పదవి భాద్యతలు చేపట్టి తెలంగాణా రాష్ట్రానికి తొలిసారిగా విచ్చేసిన సందర్భంగా ఆపార్టీ సీనియర్ నాయకురాలు తాడేల సరస్వతి ఎన్టిఆర్ భవన్ లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు సరస్వతి నిఅభినందించారు. ఈ సందర్భంగా సరస్వతి మాట్లాడుతూ నాల్గవసారి ముఖ్యమంత్రి పదవి భాద్యతలు చేపట్టి తెలంగాణా రాష్ట్రానికి రావడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు.తెలంగాణా రేఆస్త్రం తిరిగి తెక్కుగు దేశం పార్టికి పూర్వ వైభవం తీసుక రావాలని సరస్వతి ఆకాంక్షించారు.

# మాతృదేవోభవ సత్సంగ ద్వార పేద మహిళలకు కుట్టు మిషను పంపిణీ




మేడ్చల్ జులై 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్);మాతృదేవో భవ సత్సంగ శ్రీ రామలింగేశ్వర కాలనీ కీసర మండలం బ్రాంచ్ కార్యాలయంలో పేద మహిళలకు కుట్టు మిషను పంపిణీ చేచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాతృదేవోభవ సత్సంగ వ్యవస్థాపక అధ్యక్షులు కేబి. శ్రీధర్.. విచ్చేసిన కుట్టు మిషను పంపిణీ చేచారు తమ సంస్థ అనేక సేవాకార్యక్రమాలు చేపట్టిందని అందులో భాగంగా పేద మహిళలకు జీవనోపాధికి కుట్టు మిషన్లు కీసర బ్రాంచ్ కార్యాల యంలో శివలెంక నాగాఉదయ లక్ష్మి చీఫ్ జనరల్ సెక్రటరీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగిందని అన్నారు.

మున్ముందు అనేక సేవాకార్యక్రమాలు చేస్తామని అన్నారు. తన మాతృమూర్తి పేరున ప్రతినెలా వృద్ధ ఆశ్రమాలకు సరుకులు పంపిణీ చేస్తున్నామని అన్నారు. శివలేంక నాగ ఉదయలక్ష్మి .

మాతృదేవోభవ సంస్థ ను మరింత అభివృద్ధి చేస్తామని నేటి సమాజానికి మాతృ మూర్తి విశిష్ట యువతకు ప్రచారం ద్వారా తెలియ చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల సెక్రటరీ విజయ కనక దుర్గ జాతీయ కార్య దర్శి భాస్కర్ శారద జాతీయ కార్యదర్శి అల్లాజీ విజయ్ పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



ఉప్పల్, జులై 9 : మహిళలకు అండగా ఉంటూ, తనవంతు తోడ్పాటు అందిస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడఅన్నారు. ఉప్పల్ మండల పరిధిలోని కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే హాజరై చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టాల్లో ఉన్నవారికి కుటుంబపెద్దగా ముందుంటానని తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతుంటాయని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా నియోజకవర్గంలోని ప్రజలకు విద్యా, వైద్యం అందించడానికి తనవంతు సహకారం అందిస్తామన్నారు. ప్రజల కోసం పనిచేయడానికి నిరంతరం అందుబాటులో ఉంటానని హామీనిచ్చారు. కాలనీవాసుల అవసరాలు గుర్తించి, పనులు చేపడుతున్నామని తెలిపారు.

గత ప్రభుత్వం అందిస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిం చాలన్నారు. వీటితోపాటు మహిళలకు ఇస్తామని చెప్పిన తులం బంగారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్, కార్పొరేటర్లు శాంతిసాయిజెన్ శేఖర్, పన్నాల దేవేందర్రెడ్డి, జెర్రిపోతుల ప్రభుదాస్, తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. బైకును ఢీ కొట్టిన లారీ ఇద్దరు మృతి

మెదక్, జులై 9 : మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బైక్ను లారీ ఢీ కొట్టడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఈ విషాదకర సంఘటన వెల్దుర్తిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్ మండలం నాగులపల్లికి చెందిన జైపాల్రెడ్డి(45) బిహార్కు చెందిన శంభు(32) అనే వ్యక్తితో కలిసి బైక్పై వెల్దుర్తి మండలం రామంతపూర్కి వ్యవసాయ కూలీల కోసం బయలు దేరారు. ఇదే క్రమంలో ఎదరుగా వచ్చిన లారీ వారి బైక్ను ఢీకొట్టడంతో జైపాల్రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శంభును హైదరాబాద్ దవాఖానకు తరలిస్తుండగా మార్గవధ్యలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా, జైపాల్రెడ్డికి భార్య లావణ్య, కుమారుడు సాకేత్రెడ్డి, కుతూరు అమ్యూల్య ఉన్నట్లు ఎస్ఐ బాల్రాజు తెలిపారు.

# 2026 నాటికి అందుబాటులో భోగాపురం ఎయిర్ పోర్ట్ - కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

అమరావతి, జులై 9 :2026 నాటికి భోగాపురం ఎయిర్ పోర్టును అందుబాటులోకి తెస్తామని చెప్పారు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు. నేడు విజయనగరం జిల్లాలోని భోగాపురం ఎయిర్ పోర్టు ప్రాంతాన్ని పరిశీలించారు. ఎల్లుండి సీఎం చంద్రబాబు భోగాపురం విమానాశ్రయ పనుల పరిశీలనకు వస్తున్నారు. సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను కూడా ఆయన పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర ప్రాంతానికి భోగాపురం ఎయిర్ పోర్టు గుండెకాయ వంటిదని అభివర్ణించారు. నిర్ణీత సమయంలోనే భోగాపురం విమానాశ్రయం పూర్తి చేస్తామని చెప్పారు. భోగాపురం ఎయిర్ పోర్టుపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా దృష్టి సారించారని రామ్మోహన్ నాయుడు తెలిపారు. విమానాశ్రయ పనులపై సీఎం చంద్రబాబు సూచనలు కూడా తీసుకుంటామని అన్నారు. కేంద్రం నుంచి ఎలాంటి అనుమతులు కావాలన్నా వెంటనే వచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం విమానాశ్రయ పనులను ఆలస్యం చేసిందని ఆరోపించారు. డిసెంబరు నాటికి టెర్మినల్ భవనం పూర్తి చేస్తామని చెప్పారు. చిన్న చిన్న సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తామని తెలిపారు. విమానాశ్రయం పూర్తయితే దాదాపు 6 లక్షల మందికి ఉపాధి కలుగుతుందని అన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల వారే కాకుండా ఒడిశా వాసులకు కూడా భోగాపురం ఎయిర్ పోర్టు ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. దీన్ని సరిగ్గా సద్వినియోగం చేసుకోగలిగితే, భవిష్యత్తులో ఉత్తరాంధ్రకు ఎన్నో కంపెనీలు వస్తాయని తెలిపారు. గత ప్రభుత్వం ప్రాజెక్టులు పూర్తి చేయలేక, గడువులు పెంచుకుంటూ పోయిందని, కానీ తాము అధికారంలోకి వచ్చాక మొట్టమొదటి నెలలోనే ప్రాజెక్టును సందర్శించి, గడువు తేదీ చెబుతున్నామని, ఈ విషయాన్ని తాము ఓ బాధ్యతగా తీసుకుంటున్నామని వివరించారు.

# 8 మెడికల్ కాలేజీలకు అనుమతి నిరాకరణ.. ఇది రేవంత్ వైఫల్యమే : పెద్ది సుదర్శన్ రెడ్డి

హైదరాబాద్, జులై 9 :గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ మంజూరు చేసిన 8 మెడికల్ కాలేజీలకు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతులు నిరాకరించిందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తెలిపారు. గద్వాల, నారాయణపేట, ములుగు, వరంగల్, మెదక్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో మంజూరు చేసిన మెడికల్ కాలేజీల అనుమతులు నిరాకరించడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే అని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ భవన్లో పెద్ది సుదర్శన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.

జిల్లాకో మెడికల్ కాలేజీ అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వంలో సీఎం కేసీఆర్.. ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీని మంజూరు చేశారు. వైద్య విద్యను ప్రోత్సహించారు. పేద వర్గాలకు చెందిన బిడ్డలు ఇతర దేశాలకు వెళ్లి చదువుకునే బాధలను తప్పించాలనే ఉద్దేశంతో జిల్లాకో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేశారు. 2022-23 ఏడాదిలో 8 మెడికల్ కాలేజీలు, 2023-24లో 9 మెడికల్ కాలేజీలు, 2024-25లో మరో 8 మెడికల్ కాలేజీలను మంజూరు చేసింది. మొదటి రెండేండ్లకు సంబంధించిన 17 కాలేజీలకు మెడికల్ కౌన్సిల్ అనుమతి ఇచ్చింది. అవి బ్రహ్మాండంగా నడుస్తున్నాయి. 2024-25లో మంజూరైన మెడికల్ కాలేజీలకు కేసీఆర్ ప్రభుత్వం ఆనాడే నిధులు మంజూరు చేయించారు. ప్రత్యేకమైన అనుమతులు తీసుకొచ్చారు. కానీ గత ఐదారు మాసాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం నేషనల్ మెడికల్ కౌన్సిల్ వద్ద అనుమతులు తీసుకురావడంలో వైఫల్యం చెందింది అని పెద్ది సుదర్శన్ రెడ్డి తెలిపారు.

మా పార్టీ ఎమ్మెల్యేల మార్పిడి కోసం సీఎం రేవంత్ రెడ్డి అర్ధరాత్రి పని చేస్తున్నారు. కానీ 8 కాలేజీల అనుమతుల కోసం ఒక గంట కూడా సమీక్ష చేయలేదు. వైద్యాశాఖ మంత్రిత్వ శాఖతో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులు కూడా సమీక్ష చేయలేదు. ఇవాళ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండే మెడికల్ కౌన్సిల్ 8 కాలేజీలకు అనుమతిల్వివ్వకుండా తిప్పి పంపింది. దీంతో మన తెలంగాణ ప్రభుత్వం పరువు పోయింది. ప్రతి జిల్లాకు నిర్మించుకున్న బీఆర్ఎస్ కార్యాలయాలు ఎలా కూల్చాలి అని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక సెల్ పెట్టి కార్యాచరణ చేపట్టింది. కానీ మెడికల్ కాలేజీల అనుమతి కోసం చర్యలు తీసుకోవడం లేదు. జిల్లా కార్యాలయాలు కూలగొట్టే కుట్రలకు సమయం ఇస్తుంది. కానీ ఇవాళ 8 కాలేజీలను పోగొట్టుకుంది. దీనికి సీఎం రేవంత్ సిగ్గుపడాలి. ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నారు. కాంగ్రెస్, బీజేపీ నుంచి ఉన్న 16 మంది ఎంపీలు కూడా తల దించుకోవాల్సిన పరిస్థితి. తెలంగాణ అవసరాల కోసం 8 కాలేజీలు అందుబాటులోకి తేలేని పరిస్థితి ఏర్పడిందన్నారు.

తెలంగాణ ఏర్పాటు సమయంలో 850 మెడికల్ సీట్లు ఉంటే.. ఇవాళ 4 వేల పైచిలుకు ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. తక్కువ మెడికల్ సీట్లతో తెలంగాణ రాష్ట్రం చిట్టచివరలో ఉండే. ఇప్పుడు కేసీఆర్ కృషి వల్ల దేశంలోనే అగ్రభాగాన నిలిచింది మెడికల్ సీట్లలో. నర్సంపేట మెడికల్ కాలేజీ వచ్చిందని, పేద విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులోకి వచ్చిందని సంతోషపడ్డాం. కానీ 8 మెడికల్ కాలేజీల అనుమతులు సాధించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందింది. ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోంది. మీ ప్రభుత్వ విధానం, ప్రాధాన్యతలు ఏంటి..? వారం రోజుల్లో నీట్ కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. అంతలోనే నిరాకరించడం సరికాదు. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు ఈ సంఘటన ఉదాహరణ. కేసీఆర్ ఆలోచనలు అంతం చేయాలని రేవంత్ కుట్ర చేస్తున్నారు. ఆ కుట్ర కోణంలోనే 8 మెడికల్ కాలేజీలు అనుమతులు కోల్పోయాయి. కేసీఆర్ పేరు గుర్తుండే ప్రాజెక్టులను నీరుగారుస్తున్నారు అని పెద్ది సుదర్శన్ రెడ్డి మండిపడ్డారు.

ఏడు నెలల గడిచింది.. కేవలం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల చేరిక మీదనే దృష్టి. ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా జరగలేదు. తెలంగాణకు ఒక్క మెడికల్ కాలేజీ కూడా బీజేపీ ఇవ్వలేదు. తెలంగాణ నుంచి ఉన్న ఇద్దరు కేంద్ర మంత్రులు ఆత్మవిమర్శ చేసుకోవాలి. 8 మెడికల్ కాలేజీల్లో చేయాల్సిన రిక్రూట్మెంట్ విషయంలో రేవంత్ ప్రభుత్వం వైఫల్యం చెందింది. రిక్రూట్మెంట్ లేని కారణంగా నే అనుమతి నిరాకరిస్తున్నట్లు మెడికల్ కౌన్సిల్ మెయిల్ చేసింది. ఢిల్లీలో రేవంత్ వారం రోజులు ఉన్నారు కానీ వీటి అనుమతి కోసం సంప్రదించకపోవడం దురదృష్టం అని పెద్ది సుదర్శన్ రెడ్డి తెలిపారు.

# విజయవాడలో కిడ్నీ రాకెట్.. కీలక ఆదేశాలిచ్చిన ఏపీ హోంమంత్రి

అమరావతి, జులై 9 : విజయవాడలో బయటపడ్డ కిడ్నీ రాకెట్ వ్యవ హారంపై ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు కలెక్టర్, ఎస్పీ, విజయవాడ సీపీకి ఫోన్ చేసి.. ఈ వ్యవహారంపై ఆరా తీశారు. డబ్బు ఆశచూపి కిడ్నీ కాజేసిన ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా విజయవాడ సీపీని హోం మంత్రి ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిఘా పెట్టాలని సూచించారు.

గుంటూరుకు చెందిన గార్లపాటి మధుబాబు చిన్నపాటి వ్యాపారాలు చేసి కుటుంబాన్ని పోషించే వాడు. కరోనా తర్వాత ఆర్థికంగా చితికిపోవడంతో అప్పులు ఎక్కువయ్యాయి. కుటుంబాన్ని పోషించేందుకు ఆటో డ్రైవర్గా మా రాడు.. కానీ గతంలో చేసిన అప్పులు మాత్రం తీర్చలేని దుస్థితిలో ఉండిపోయాడు. ఇలాంటి సమయంలోనే బాషా అనే వ్యక్తి సోషల్మీడియాలో మధుబాబుకు పరిచయమయ్యాడు. కిడ్నీ అమ్మి డబ్బులు సంపాదించుకోవచ్చని సలహా ఇచ్చాడు. తాను కూడా గతంలో అలాగే ఓ కిడ్నీ అమ్మేసుకున్నానని నమ్మబలికాడు. దీంతో మధుబాబు కూడా కిడ్నీ అమ్మే ందుకు సిద్ధమయ్యాడు. ఇదే విషయం బాషాకు చెప్పడంతో అతను వెంకట్ అనే మరో వ్యక్తిని పరిచయం చేశా డు. వెంకట్ ద్వారా కిడ్నీ అమ్ముకుంటే రూ. 30 లక్షలు ఇస్తాడని బాషా నమ్మ బలికాడు. దీంతో వెంకట్ అడిగిన వివరాలన్నీ మధుబా బు చెప్పాడు. కొద్ది నెలల పాటు నెలవారీ ఖర్చులు కూడా వెంకట్ ఇచ్చాడు. ఈ క్రమంలో గత నెల 15వ తేదీన విజయవా డలోని విజయ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తీసుకెళ్లి మధుబాబుకు ఆపరేషన్ చేయించి కిడ్నీ తీసుకున్నాడు. దాన్ని వేరే వ్యక్తికి సెట్ చేశారు.

# కేసీఆర్పై అసభ్యకరమైన పోస్టులు.. పోలీసులకు ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ నాయకులు



సిద్దిపేట, జులై 9 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్పై సోషల్ మీడియాలో అసభ్యకర రీతిలో పోస్ట్ చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం సిద్దిపేట జిల్లా మద్దూరు పోలీస్ స్టేషన్లో బీఆర్ఎస్ ధూళిమిట్ట మండల యూత్ అధ్యక్షుడు బడుగు సాయిలు ఆధ్వర్యంలో పలువురు యూత్ నాయకులు ఏఎస్సై జగదీశ్వర్కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బడుగు సాయిలు మాట్లాడుతూ.. ఫేస్బుక్లో ఆదిత్యచౌదరి రాయుడు అనే వ్యక్తి మద్యం సీసాలతో కూడిన కుర్చిలో కూర్చున్నట్లు కేసీఆర్ ఫొటోను మార్ఫింగ్ చేసి పోస్ట్ చేసినట్లు తెలిపారు.

కేసీఆర్ను ఎంతగానో అభిమానించే తమ మనోభావాలు దెబ్బతీసే విధంగా సదరు పోస్ట్ ఉందని, దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకొని నిందితున్ని కఠినంగా శిక్షించాలని కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ మద్దూరు మండల యూత్ అధ్యక్షుడు గూడ రవీందర్రెడ్డి, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు పోతుగంటి రవీందర్, ఉమ్మడి మద్దూరు మండల సోషల్ మీడియా ఇన్చార్జి పాకాల కిరణ్కుమార్, యూత్ నాయకులు పిడిశెట్టి గౌరీశ, నల్ల అమర్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తచట్టాలపై లాయర్లదీక్షకు ప్రజాసంఘాల సంఘీభావం



ఖమ్మం, జులై 9 :(నేటినిజం ప్రతినిధి): కేంద్రప్రభుత్వం జూలై 1వ తేదీ నుండి అమలులో వచ్చే విధంగా తీసుకొచ్చిన నూతన చట్టాలను నిరసిస్తూ ఖమ్మం కోర్టు ఎదుట లాయర్లు తలపెట్టిన నిరసన దీక్షకు మంగళవారం ప్రజా సంఘాలు సంఘీభావం ప్రకటించాయి. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కె.వి.కృష్ణారావు మాట్లాడుతూ...కొత్త చట్టాల రూపకల్పన సందర్భంగా పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావులు, విద్యావంతులు, లాయర్లను సంప్రదించకుండా, చర్చించకుండా ఏకపక్షంగా చట్టాల అమలుకు పూనుకోవడం వల్ల తీవ్రమైన సంక్షోభంతో పాటు అమితమైన నష్టాలు జరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామిక దేశంలో ఏ చట్టమైన ప్రజాస్వామ్యక బద్ధంగా ప్రవేశపెట్టాలని అలా కాకుంటే ప్రజలకు తీవ్రమైన నష్టాలు జరుగుతాయని ఆరోపించారు. కేవలం తమ పార్టీ ఎదుగుదలకు తమ లబ్ధికి కేంద్ర ప్రభుత్వంలోని మధ్య జనతా పార్టీ భారతీయు జనతా పార్టీ చట్టాలను తీసుకొచ్చిందని విమర్శించారు. గతంలో పోలీస్ కస్టడీ 15 రోజులు కాగా నేడు ఈ కొత్త చట్టాల వల్ల 60 నుండి 90 రోజుల వరకు కస్టడీని పొడిగించడం వలస చట్టంను గుర్తుకు తెచ్చుతుందన్నారు. సత్వర న్యాయం కోసం మరింత నాణ్యమైన న్యాయం కోసమే ప్రవేశ పెట్టాము అనే ఈ చట్టాలతో న్యాయం కాకుండా అన్యాయమే జరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ చట్టాలను తాత్కాలికంగా వాయిదా వేసి, అందరితో చర్చించి, ఏకాభిప్రాయాన్ని సాధించి, అందరికీ ఆమోదయోగ్యంగా తీర్చిదిద్దిన అనంతరమే చట్టాల అమలుకు శ్రీకారం చుట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజాసంఘాల బాధ్యులు బానోతు భద్రు నాయక్, ఇతర ప్రజాసంఘాల బాధ్యులు పుల్లూరు నాగయ్య, వెంకటాచారి, తదితరులున్నారు.

# డాగ్ స్క్వాడ్ "చీతా" మృతి.. సంప్రదాయ పద్ధతిలో ఖననం





జన్నారం,జులై 9 : డాగ్ స్క్వాడ్ చీతా మృతి చెందింది. అటవీశాఖ అధికారులు సాంప్రదాయ పద్ధతిలో ఖననం చేశారు. జర్మనీ షెఫర్డ్ చెందిన ప్రత్యేక శిక్షణ పొందిన కుక్క పేరే చీతా. ఆ పేరు వింటేనే స్మగ్లర్ల గుండెల్లో పరుగులు.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల పులుల అభయారణ్యంలోని మంచిర్యాల జిల్లా జన్నారం డివిజన్ కు 2018 డిసెంబర్ 15న మధ్యప్రదేశ్ లోని గ్వాలియర్ లో ప్రత్యేక శిక్షణ పొందిన స్థానిక అటవీ బీట్ అధికారులు శ్రీగాద శ్రీనివాస్, జాడి సత్యనారాయణ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జర్మనీ షెఫర్డ్ చీతా (కుక్క)ను ఇక్కడికి తీసుకొచ్చారు.

ఆ చీతా గుండెపోటు గురై సోమవారం మృతి చెందింది.ఆ తర్వాత వెటర్నరీ డాక్టర్ చే పోస్టుమార్టం నిర్వహించి స్థానిక అటవీ శాఖ సముదాయం ప్రాంతంలో సంప్రదాయ పద్ధతిలో తాళ్ళపేట, జన్నారం ఇన్చార్జి రేంజ్ ఆఫీసర్ సుష్మారావు, ఇందన్ పెల్లి రేంజ్ ఆఫీసర్ ఎం.డి హఫీజొద్దీన్, డిప్యూటీ రేంజ్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు తిరుపతి, హైమావతి,మమత శ్రీనివాస్, రైమొద్దీన్, డివిజన్ సూపరిండెంట్ షమిమోదీన్, అసిస్టెంట్ రవీందర్ లు సంప్రదాయ పద్ధతిలో ఖననం చేశారు.

ఆచీతా ప్రత్యేక చొరవతో ఉమ్మడి జిల్లాలోని అడవుల్లో వన్యప్రాణులను, చిరుతపులను వేటాడిన వేటగాళ్ళను పట్టుకుంది. కలప స్మగ్లర్లను కూడా ఆ కుక్క ఎంతో చాకచక్యంగా గుర్తించకలిగింది. జన్నారం డివిజన్లోని బొమ్మెనలో ఓ దుప్పిని వేటాడిన వేటగాళ్ళను పసిగట్టి పట్టుకుంది.ఈ సంఘటన అప్పుడు ఉమ్మడి జిల్లాలో సంచలనం కలిగింది.ఆ తర్వాత లింగాపూర్ మండలంలోని మామిడిపెల్లిలో చిరుతపులిని చంపిన వేటగాళ్ళను నిజామాబాద్ లో పసిగట్టి పట్టుకుంది.ఆ తరువాత మంచిర్యాల లోని ర్యాలీగడ్ పూర్ లో ఓ చిరుతపులిని చంపి, గోళ్లను ఎత్తుకెళ్ళిన వేటగాళ్లను పసిగట్టి పట్టుకుంది.

ఇలా ఆ చీతా పలు వన్యప్రాణుల కేసులోనూ , కలప స్మగ్లర్ల కేసుల్లోనూ అటవీఅధికారులకు ఎంతో సహకరించడంతో కేసులను చేదించారు. దీంతో ఆ కుక్క పేరు వింటేనే స్మగ్లర్ల గుండెల్లో రైళ్లు పరుగెత్తేయి. అటవీ కేసు విషయంలో ఆ కుక్కను పట్టుకొని అధికారులు ఆ ప్రాంతానికి వచ్చిందంటే చాలు ఎంతటి కరుడుగట్టి నేరగాలైనా చేసిన నేరాన్ని తప్పుకుండా ఒప్పుకునేవారు. ప్రస్తుతం ఆ చీతా అకాల మరణంతో అటవీ అధికారుల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

# 'సహకారాల మధ్య సహకారం' అంటే సహకార సంఘాలన్నీ విజయవంతం కావడానికి అన్ని సహకార సంఘాల సహకార లక్ష్యాన్ని ప్రోత్సహించాలి...




న్యూఢిల్లీ, జులై 9 :ఈరోజు గుజరాత్‌లోని గాంధీనగర్‌లో 102వ అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన 'సహకార్ సే సమృద్ధి' (సహకారం ద్వారా శ్రేయస్సు) కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి మరియు సహకార మంత్రి శ్రీ అమిత్ షా ప్రసంగించారు. గుజరాత్ ముఖ్యమంత్రి శ్రీ భూపేంద్ర పటేల్, సహకార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సహా పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

శ్రీ అమిత్ షా తన ప్రసంగంలో, ఈ రోజు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి అని, ఈ రోజు బెంగాల్ మరియు కాశ్మీర్‌లను భారతదేశంలో అంతర్భాగాలుగా మార్చినందుకు మేము ఆయనకు రుణపడి ఉన్నామని అన్నారు. ఒకే దేశంలో రెండు చట్టాలు, పైభాగంలో రెండు తలలు, రెండు జెండాలు ఉండడాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమాన్ని నడిపిన వ్యక్తి డాక్టర్ ముఖర్జీ అని, దీని కోసం పోరాడి తన ప్రాణాలను అర్పించిన ఘనత ఆయనదేనన్నారు. నేడు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో రెండు చట్టాలు (విధాన్), పైభాగంలో రెండు తలలు (ప్రధాన్), రెండు జెండాలు (నిషాన్) అనే ద్వంద్వత్వం కాశ్మీర్‌లో ముగిసిందని, త్రివర్ణ పతాకం అక్కడ ఎగురుతున్నదని శ్రీ షా అన్నారు. గొప్ప గర్వం. దేశంలోని దళితుల కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి, సామాజిక సామరస్యానికి పెద్దపీట వేసి, మత మార్పిడిని వ్యతిరేకించిన బాబూ జగ్జీవన్ రామ్ జీ వర్ధంతి కూడా నేడు అని అన్నారు.ఈ రోజు సహకార రంగంతో అనుబంధం ఉన్న ప్రజలందరికీ మరియు కార్మికులందరికీ అనేక విధాలుగా చాలా ముఖ్యమైన రోజు అని కేంద్ర సహకార మంత్రి అన్నారు. ఈ రోజున ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ స్వతంత్ర సహకార మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేశారని అన్నారు. ప్రత్యేక సహకార మంత్రిత్వ శాఖ డిమాండ్‌ను గత ప్రభుత్వాలు ఏనాడూ పట్టించుకోలేదన్నారు. గుజరాత్ నుంచి వచ్చిన శ్రీ నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత నేటి కాలంలో సహకారం ఆవశ్యకతను అర్థం చేసుకుని స్వతంత్ర సహకార మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేశారని ఆయన అన్నారు.

ఈ రోజు గుజరాత్ ప్రభుత్వం చాలా ముఖ్యమైన నిర్ణయం తీసుకుందని, నానో-యూరియా మరియు నానో-డిఎపిపై 50 శాతం సబ్సిడీని ప్రకటించిందని శ్రీ అమిత్ షా అన్నారు. ఈ నిర్ణయానికి గుజరాత్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన ఆయన, రైతులు నానో-యూరియాను ఒక్కసారి మాత్రమే పిచికారీ చేయాలని, పంట ఎదుగుదల సమయంలో పొలాల్లో యూరియాను జోడించాల్సిన అవసరం లేదని అన్నారు. నానో-యూరియా మరియు నానో-డిఎపిని పొలంలో పిచికారీ చేయడం వల్ల ఉత్పత్తి పెరగడానికి సరిపోతుందని మరియు భూసారాన్ని కూడా కాపాడుతుందని శ్రీ షా చెప్పారు. మోదీ ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించిందని, రైతులు వాటిని వినియోగించుకోవాలని అన్నారు. సేంద్రీయ ఉత్పత్తులను ప్రోత్సహించడానికి మరియు సేంద్రియ వ్యవసాయాన్ని అభ్యసిస్తున్న రైతులకు వారి ఉత్పత్తులకు సరసమైన ధరను నిర్ధారించడానికి భారత ప్రభుత్వం నేషనల్ కోఆపరేటివ్ ఆర్గానిక్ లిమిటెడ్ (ఔఅూఒ) ను స్థాపించిందని ఆయన అన్నారు. ఈ రోజు భారత్ ఆర్గానిక్ అట్టా కూడా ఔఅూఒ ద్వారా ప్రారంభించబడిందని శ్రీ షా చెప్పారు. ఢిల్లీలో ఆర్గానిక్ ఉత్పత్తుల దుకాణాన్ని కూడా అమూల్ ప్రారంభించిందని శ్రీ షా చెప్పారు. భారత్ ఆర్గానిక్ మరియు అమూల్ రెండూ నమ్మకమైనవని, 100 శాతం ఆర్గానిక్ బ్రాండ్‌లని ఆయన అన్నారు. ప్రపంచంలోని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఆర్గానిక్ ఉత్పత్తులను పరీక్షించిన తర్వాతే వాటిపై భారత్ బ్రాండ్ ముద్ర వేస్తామని శ్రీ షా చెప్పారు.

# విడిఎన్‌కెహెచ్‌లోని రోసాటమ్ మండపాన్ని సందర్శించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జులై 9 :రష్యా అధ్యక్షుడు శ్రీ వ్లాదిమిర్ పుతిన్ తన వెంట రాగా ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజున మాస్కో లోని విడిఎన్‌కెహెచ్ లో అఖిల రష్యా ప్రదర్శన కేంద్రాన్ని సందర్శించారు. నేతలు ఇద్దరూ విడిఎన్‌కెహెచ్ లోని రోసాటమ్ మండపంలో కలియదిరిగారు. రోసాటమ్ మండపాన్ని 2023 నవంబరు లో ప్రారంభించడమైంది. ఇది విజ్ఞానశాస్త్ర పరమైన, సాంకేతిక విజ్ఞాన పరమైన అభివృద్ధి సూచికలతో ఏర్పాటు చేసిన అతి పెద్ద ప్రదర్శన మండపాలలో ఒకటి. పరమాణు శక్తిని పౌర ప్రయోజనాలకు వినియోగించుకొనే రంగంలో భారతదేశం-రష్యా సహకారాన్ని ప్రత్యేకంగా వివరించే ఛాయాచిత్రాల ప్రదర్శనను ప్రధాన మంత్రి చూశారు. భారతదేశంలో కూడంకుళం పరమాణు విద్యుత్తు కేంద్రాని (కెకెఎన్ పిపి)కి గుండెకాయగా ఉన్న వివిఇఆర్-1000 తాలూకు శాశ్వత కార్యాచరణ ప్రధాన నమూనా అయిన "అటామిక్ సింఫనీ"ని కూడా ప్రధాన మంత్రి తిలకించారు. భారతదేశాని కి, రష్యా కు చెందిన విద్యార్థుల బృందంతో మండపం వద్ద ప్రధాన మంత్రి మాట్లాడారు. విజ్ఞానశాస్త్రం- సాంకేతికవిజ్ఞాన రంగంలో భావి తరాల మేలు కోసం, భూగ్రహం మేలు కోసం ఇంకా ఏయే అవకాశాలను వినియోగించుకోవచ్చో పరిశీలించవలసిందంటూ విద్యార్థులను ప్రధాన మంత్రి ప్రోత్సహించారు.

# హైదరాబాద్ జూపార్కులో కేర్ టేకర్‌పై సింహం దాడి

హైదరాబాద్, జులై 9 : హైదరాబాద్ నెహ్రూ జూలాజికల్ పార్కులో సోమవారం ఘోరం జరిగింది. సింహాలు ఉండే ఎన్‌క్లోజర్ ను పరిశుభ్రం చేసేందుకు వెళ్లిన సయిాద్ హుస్సేన్‌పై ఓ సింహం దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది.

ఆ సింహం దాడి నుంచి కేర్ టేకర్ సయిాద్ హుస్సేన్ తప్పించుకున్నాడు. అప్రమత్తమైన జూ సిబ్బంది.. హుస్సేన్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సింహాలు ఉండే ఎన్‌క్లోజర్ వద్ద జూ సిబ్బంది పిటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసింది. ప్రస్తుతం హుస్సేన్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు.

వారం రోజుల క్రితం సయిాద్ ఫర్హాన్ అనే సిబ్బందిని పాము కరిచిన సంగతి తెలిసిందే. జంతువులు ఉండే ఎన్‌క్లోజర్‌ను శుభ్రం చేస్తుండగా, పాము ఫర్హాన్‌ను కరిచినట్లు జూ సిబ్బంది తెలిపారు. ప్రస్తుతం ఫర్హాన్ ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఫర్హాన్ మూత్రం పిండం దెబ్బతిన్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆయనకు నెఫ్రాలజిస్ట్ డాక్టర్ల ఆధ్వర్యంలో చికిత్స కొనసాగుతోన్నట్లు తెలుస్తోంది.

# ఆ ఉత్పత్తుల విక్రయాలను నిలిపేశాం.. సుప్రీంకోర్టులో 'పతంజలి' అఫిడవిట్

హైదరాబాద్, జులై 9 :మాన్యుఫాక్చరింగ్ లైసెన్స్ రద్దయిన 14 రకాల ఉత్పత్తుల విక్రయాలను నిలిపివేశామని పతంజలి ఆయుర్వేద సంస్థ సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. ఆయా ఉత్పత్తులను వెనక్కి తీసుకోవాలని దేశవ్యాప్తంగా ఉన్న తమ ఫ్రాంచైజీ స్టోర్లకు సూచించినట్లు తెలిపింది. అదేవిధంగా వాటికి సంబంధించిన ప్రకటనలను ఉపసంహరించుకోవాలని మీడియా సంస్థలకు సమాచారం ఇచ్చినట్లు అఫిడవిట్‌లో పేర్కొంది.

వినియోగదారులను తప్పుదోవ పట్టించేలా వాణిజ్య ప్రకటనలు ఇచ్చిన కేసులో పతంజలి ఆయుర్వేద సంస్థ సుప్రీంకోర్టు విచారణను ఎదుర్కొంటోంది. పతంజలి సంస్థ తప్పుదోవ పట్టించేలా వాణిజ్య ప్రకటనలు ఇచ్చినట్లు నిర్ధరణ కావడంతో ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఆ సంస్థపై చర్యలు తీసుకుంది. ఆ సంస్థకు చెందిన 14 రకాల ఉత్పత్తులు, అనుబంధ విభాగం దివ్య ఫార్మసీ ఉత్పత్తుల తయారీ లైసెన్సును రద్దు చేసింది.

ఈ క్రమంలోనే కేసు సుప్రీంకోర్టుకు వెళ్లింది. ఉత్తరాఖండ్ సర్కారు వేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. అఫిడవిట్ దాఖలు చేయాలని పతంజలి ఆయుర్వేద సంస్థను ఆదేశించింది. దాంతో ఉత్తరాఖండ్ సర్కారు తయారీ లైసెన్స్‌లు రద్దు చేసిన ఆ 14 రకాల ఉత్పత్తుల విక్రయాలను నిలిపేశామని తెలుపుతూ పతంజలి ఆయుర్వేదిక్ సంస్థ అఫిడవిట్ దాఖలు చేసింది.

# తమిళనాడు సీఎం స్టాలిన్‌ను ప్రశంసించిన చిదంబరం

న్యూఢిల్లీ, జులై 9 : కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన క్రిమినల్ చట్టాల్లో రాష్ట్ర స్థాయిలో సవరణలు చేసేందుకు స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీకి మద్రాస్ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి ఎం సత్యనారాయణన్ నేతృత్వం వహించనున్నారు. కమిటీ నివేదికను నెల రోజుల్లోపు ప్రభుత్వానికి అందించనున్నది. కమిటీ అనేక న్యాయవాద సంఘాలు, ఇతర వాటాదారులతో చర్చించి.. అభిప్రాయాలను తీసుకోనున్నది. ఈ క్రమంలో స్టానిల్ ప్రభుత్వం నిర్ణయాన్ని కాంగ్రెస్ నేత పీ చిదంబరం మంగళవారం స్వాతించారు. రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితాలో క్రిమినల్ చట్టం ఒక సబ్జెక్ట్ అని.. ఇది కొత్త చట్టాన్ని సవరించేందుకు రాష్ట్ర శాసనసభకు అధికారం ఉందంటూ ట్వీట్ చేశారు. రిటైర్డ్ జడ్జి కే సత్యనారాయణన్‌ను ఏకసభ్య కమిటీని నియమించడాన్ని సైతం ఆయన స్వాగతించారు. ఈ ఏడాది జూలై ఒకటి నుంచి మూడు చట్టాలు అమలులోకి వచ్చిన విషయం తెలిసిందే.

ఇదిలా ఉండగా.. కేంద్రం తీసుకువచ్చిన చట్టాల పేర్లు హిందీలో ఉన్నాయి. దాంతో ఆయా చట్టాల పేర్లను సైతం మార్చాలనే సూచనను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ చట్టం పేర్లపై తమిళనాడు, కర్ణాటక అభ్యంతరం తెలిపాయి. రాజ్యాంగంలోని 348వ అధికరణం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే చట్టాలు ఆంగ్లంలో ఉండాలని పేర్కొంటున్నాయి.

# సైదమ్మను పరామర్శించిన పరికపల్లి

## – ఆర్థిక సాయం అందజేత

ఖమ్మం, జులై 9 :(నేటినిజం ప్రతినిధి): కొనిజర్ల మండలం




పెద్దమునగాల గ్రామానికి చెందిన ఇలపోగు సైదమ్మ ఇటీవల ప్రమాదవశాత్తు తలకి గాయం అయింది ఆమెను పరామర్శించి కొంత ఆర్థిక సహాయం అందించిన కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ పరికపల్లి శ్రీనివాస్. అధైర్యపడవద్దని అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రజాసేవ చేయడం అంటే నాకు ఎంతో ఇష్టమని ప్రజాసేవలో ముందుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో పల్లెకంటి నరేష్, తడికమళ్ల బస్వయ్య, యలమంద వెంకన్న, రాంబాబు, అర్జున్, నవీన్, తిరుపతిరావు పాల్గొన్నారు.

# దాసు పైలాపై తక్షణమే చర్యలు తీసుకోవాలి

## – ఎస్ఐకి వినతిపత్రం అందజేత

ఖమ్మం, జులై 9 :(నేటినిజం ప్రతినిధి): ఖమ్మం పట్టణ పురోహిత



సంఘం అధ్యక్షులు మారుతి వీరభద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ఖమ్మం వన్ టౌన్ ఎస్ఐ సాయి కుమార్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. పురోహిత సంఘం అధ్యక్షులు మారుతి వీరభద్ర ప్రసాద్ మాట్లాడుతూ... దాసు పైలా అనే మూర్ఖుడు పురోహితుల మీద సభ్యత, సంస్కారం లేకుండా మాట్లాడడం హేయమైన చర్య అని నీవు సంస్కారహీనుడువని నీలాంటి వారు వైష్ణవ జాతికే తలంపుగా తయారయ్యారని ఇకనైనా నీ అహంకారపూరిత మాటలు విరమించుకొని యావత్ బ్రాహ్మణ పురోహితులకు క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో దాసు పైలా మీద న్యాయ పోరాటానికి కూడా వెనకాడబోమని హెచ్చరించడం జరిగింది. పురానికి హితువు చేసే పురోహితుల మీద, సాత్వికుల మీద విమర్శలు చేయడం తన పతనానికి తానే కారణమవుతాడని హితవు పలకడం జరిగింది. ఈ కార్యక్రమంలో పురోహిత సంఘ కన్వీనర్ మారుతి శేష ఫణి కుమార్ శర్మ, కార్యవర్గ సభ్యులు ఇంగువ అజయ్ కుమార్ శర్మ, సహాయ కార్యదర్శి జిలుగుల సతీష్ శర్మ, వైష్ణవ సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొదమసింహం రవి కిరాణా చార్యులు, వైష్ణవ సేవా సంఘం నాయకులు రాయపురం రామకృష్ణ, పురోహిత సంఘ సభ్యులు గూడా యోగి శర్మ, తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో సీత్లా పండుగ



మహబూబాబాద్, జులై 9 :(నేటినిజం ప్రతినిధి): పెద్దవంగర మండలంలోని ఆయా తండాలలో మంగళవారం గిరిజనులు సాంప్రదాయ దుస్తులు ధరించి సీత్లా భవాని వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్దవంగర శివారు తీక్యా తండాలో గిరిజన పెద్దలు భీమా నాయక్,బాలు నాయక్, యాకన్ననాయక్, దేవా నాయక్ ఆధ్వర్యంలో భవాని వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. గిరిజన మహిళలు సంప్రదాయంలో దుస్తులు ధరించి నైవేద్యం తీసుకుని భవానికి సమర్పించి వర్షాలు సమృద్ధిగా కోవాలని, పంటలు సమృద్ధిగా పండాలని భవాని అమ్మవారిని వేడుకున్నారు. ప్రజలందరూ అష్టైశ్వర్యాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు. తండా పెద్దలు భవానికి నైవేద్యం సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో లలిత,బిందు, ద్వాలి, భద్రమ్మ, హుస్సేన్, యాకన్న, సోమన్న, బుచ్చాలు, సోని,వీరమ్మ తదితరులు ఉన్నారు.

# సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పంప్ హౌస్‌లను పరిశీలించిన మంత్రి



భద్రాద్రి కొత్తగూడెం జూలై 9 (నేటినిజం ప్రతినిధి) : ములకలపల్లి మండలం పూసుగూడెం గ్రామంలో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పంప్ హౌస్ లను పరిశీలించి స్థానిక ఇరిగేషన్ ఆఫీసులో జిల్లా ఇరిగేషన్, వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన అనంతరంమీడియా సమావేశం ఏర్పాటు చేసి విదేశీ టెక్నాలజీతో నిర్మించిన పంప్ హౌస్ ల మోటార్ల చెకింగ్ కోసం చైనా నుంచి నిపుణులు రావలసి ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం వారిని త్వరలోనే రప్పించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని వారు వచ్చిన తర్వాత పనులు ప్రారంభించి ఏన్కూర్ లింకు కెనాల్ ద్వారా వైరా రిజర్వాయర్ కు అతి త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించి ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో నీటిని అందించి రైతుల కళ్ళలో ఆనందం చూడాలని వ్యవసాయ రంగ అభివృద్ధికి నాంది పలకాలనితెలంగాణ రాష్ట్ర, వ్యవసాయ, మార్కెటింగ్, కో-ఆపరేటివ్, హ్యాండ్లూమ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్థానిక శాసనసభ్యులు జారె ఆదినారాయణ మీడియా సభాముఖంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, జిల్లాస్థాయి కాంగ్రెస్ నాయకులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు, పోలీస్ అధికారులు, తదితరులున్నారు.

